## క్లుప్తంగా

### పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసా

**కొడకండ్ల:** నిరుపేదల ఆరోగ్యానికి సీఎంఆర్ ఎఫ్ భరోసాగా నిలుస్తుందని మండల బీఆర్ ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ అన్నారు. సోమవారం రామవరం గ్రామానికి చెందిన మల్లయ్యకు మంజూరైన రూ.35 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీలు శిరీష, మణెమ్మ, యాకూబ్, రణ ధీర్, సోమయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

### నిధులు మంజూరు

**చిల్పూరు:** చిల్పూరు గ్రామాభివృద్ధికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరిల కృషి ఫలితంగా ఎన్‌ఆర్‌జీఎస్ నుంచి రూ. కోటి నిధులు మంజూరు అయినట్లు సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం ఆవరణలో సోమవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. నూతనంగా మండలం ఏర్పడినప్పటి నుంచి మండల కేంద్రంలో అభివృద్ధి సరిగా జరగలేదనే విషయాన్ని ఎమ్మెల్సీల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి చిల్పూరు అభివృద్ధికి నిధుల మంజూరు విషయంలో ప్రత్యేక కృషి చేశారని తెలిపారు.

### సీఐని కలిసిన నాయకులు

**రఘునాథపల్లి:** నూతనంగా బాధ్యతలు చేపట్టిన జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డిని సోమవారం రఘునాథపల్లి సర్కిల్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ నేతలు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీఐకి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. మాజీ జెడ్పీటీసీ, రైతుబంధు సభ్యుడు రాంబాబు, సర్పంచ్‌లు రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, యాదగిరి, కొమురయ్య తదితరులు ఉన్నారు.

**బుగులు వెంకన్నను దర్శించుకున్న సీఐ**

**చిల్పూరు:** చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామిని సోమవారం సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు. సీఐ ఆలయానికి చేరుకోగానే ఎస్సై వినయ్‌కుమార్ స్వాగతం పలికారు. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిల్పూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు.

### పౌష్టికాహారంతో ఎదుగుదల



**బచ్చన్నపేట:** పౌష్టికాహారం విద్యార్థుల్లో శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడుతుందని చిర్ర సాయిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ సి.నరేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని దుబ్బగుంటపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోషక విలువలు కలిగిన పదార్థాలను సోమవారం అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా సంస్థ ద్వారా విద్యార్థులకు అల్పాహారాన్ని అందించే వారమని, ఇటీవల ప్రభుత్వమే రాగి జావ అందిస్తున్నందున బెల్లంతో చేసిన పల్లీపట్టీలు, నువ్వుల ఉండలు, బిస్కట్లు తదితర స్నాక్స్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. కాగా, గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు గొట్టె కనకయ్య, రత్నం, రఘుమూర్తి, రజిత, ప్రవీణ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

**స్టేషన్‌ఘన్‌పూర్:** ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ బొట్ల మహేష్ డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం ఆగస్టు రెండో వారంలో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేసేందుకు డివిజన్ కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. గత 29 ఏళ్లుగా సామాజిక, ఆర్థిక, రాజకీయ రుగ్మతలను తొలగించి ఆధిపత్యం, పెత్తనం లేని నూతన వ్యవస్థ నిర్మాణం, ప్రజా సంక్షేమం కోసం అనేక ఉద్యమాలను నడుపుతూ మాదిగ దండోరా ఉద్యమం ప్రజాహితం కోసం అంకితమైందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గోవిందు ఇసాక్, గాదె శ్రీధర్, మంద శ్రీను, నలిమెల నాగరాజు, ఆదాం, అశోక్, నవీన్, రాంచందర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### రైతులను ఆదుకోవాలి

**పాలకుర్తి టౌన్:** ఇటీవల కురిసిన అధిక వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్య అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు కమ్మగాని శ్రీకాంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సోమయ్య మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేలు అందిస్తామని సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన అమలుకు నోచుకోలేదని అన్నారు. మహేందర్, శ్రీమాన్, సుంకరనేని కోటేశ్వర్, సంపత్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులనే ఎంపిక చేస్తాం

**కొడకండ్ల:** డబుల్‌బెడ్రూం ఇళ్లు, ఇళ్ల స్థలాల పంపిణీకి సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామని తహసీల్దార్ అంజయ్య అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో తహసీల్దార్ మాట్లాడుతూ నిర్మాణం పూర్తయిన 50 డబుల్‌బెడ్రూం ఇళ్లలో 13 స్థలం ఇచ్చిన వారికి గ్రామసభ తీర్మానం మేరకు కేటాయించడం జరుగుతుందని, మిగిలిన 37 ఇళ్లు, 50 గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపికతో పాటు పేదల కోసం కొనుగోలు చేసిన ప్రభుత్వ స్థలంలో 179 ప్లాట్లు చేసి నివేశ స్థలాల కోసం అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, ఎంపీటీసీ విజయలక్ష్మి, మార్కెట్ డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, ఆర్‌ఐ శ్రీనివాస్, కార్యదర్శి శ్రీనివాస్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.



కొడకండ్ల: గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ అంజయ్య

**వ్యవసాయ శాఖపై సభ్యుల ఆగ్రహం**

**జఫర్‌గఢ్:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్న విషయంలో ప్రభుత్వానికి తప్పుడు నివేదిక సమర్పించారని వ్యవసాయ శాఖ అధికారులపై సభ్యులు మండల సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రడపాక సుదర్శన అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన పనితీరుపై సభలో చర్చించారు. వ్యవసాయ శాఖ పనితీరుపై ఏఓ దీప్తి దేవర సభకు వివరిస్తుండగా సాగరం, హిమ్మత్‌నగర్ సర్పంచ్‌లు గాదె ప్రవీణ్‌రెడ్డి, తాటికాయల అశోక్ అభ్యంతరం తెలుపుతూ జిల్లాలోనే జఫర్‌గఢ్ మండలంలో అత్యధిక వర్షపాతం నమోదు కావడంతో పాటు వరద ఉధృతి కారణంగా పలు పంటలు దెబ్బతిన్నప్పటికీ వ్యవసాయ అధికారులు మండలంలో ఎలాంటి పంట నష్టం జరగలేదని ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీపీ రడపాక సుదర్శన్ జోక్యం చేసుకొని వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలపై మళ్లీ రీ సర్వే నిర్వహించి నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చూడాలని ఆదేశించారు. ఈజీఎస్‌పై ఏపీఓ కరుణ మాట్లాడుతుండగా సర్పంచ్‌లు బానోత్ తులసమ్మ, సొంటిరెడ్డి సంపత్‌రెడ్డి అడ్డుకొని క్రీడాప్రాంగణాలు, ఇంకుడు గుంతలకు సంబంధించిన బిల్లులు ఇప్పటి వరకు రాలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జఫర్‌గఢ్: మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్

**అధికారుల పనితీరుపై సభ్యుల అసహనం**

**పాలకుర్తి:** మండల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడంలో అధికారులు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. సోమవారం ఎంపీపీ నల్ల నాగిరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు అంగన్‌వాడీల పనితీరు సరిగాలేదని ఆరోపించారు. దీంతో ఎంపీపీ జోక్యం చేసుకొని ఇకమీదట అంగన్‌వాడీల పనితీరు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో సంబంధిత శాఖల అధికారులు తగిన శ్రద్ధ చూపించాలని అన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎం.డి మదార్, ఎంపీడీఓ అశోక్ కుమార్, తహసీల్దార్ పాల్‌సింగ్, ఏఈలు పాల్గొన్నారు.



పాలకుర్తి సభలో ఎంపీపీ నాగిరెడ్డి

### నేడు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

**స్టేషన్‌ఘన్‌పూర్:** డివిజన్ కేంద్రంలోని శ్రీతిరుమలనాథ స్వామి దేవస్థానంలో శ్రీతిరుమల తిరుపతి దేవస్థానం వారి సౌజన్యంతో నేడు (మంగళవారం) సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ యాద శ్రీనివాస్, అర్చకులు కలకోట రామానుజాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా చేపడుతున్నారని, వ్రతంలో కూర్చునే దంపతులకు ఎలాంటి రుసుము లేకుండా ఉచిత సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కొబ్బరి కాయ, పూలు, హారతి తెచ్చుకోవాలని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. పూర్తి వివరాలకు 9866211638 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### డ్రెయినేజీ పనుల పరిశీలన

**చిల్పూరు:** మండలంలోని చిన్నపెండ్యాల బస్ స్టాప్ సమీపంలోని ఆర్చి నుంచి గ్రామ పంచాయతీ వరకు జెడ్పీ నిధులతో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులను ఎంపీటీసీ తాళ్లపల్లి ఉమసమ్మయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ మెయిన్‌రోడ్డులో డ్రెయినేజీ లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నాణ్యతతో కూడిన పనులు చేయించి త్వరలో డ్రెయినేజీని వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

# నిరుపేదల పక్షపాతి సీఎం కేసీఆర్



స్టేషన్‌ఘన్‌పూర్: కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

**స్టేషన్‌ఘన్‌పూర్:** తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిరుపేదల పక్షపాతిగా పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారని, ప్రజలంతా సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉండాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాలకు చెందిన 111 మంది లబ్ధిదారులకు సోమవారం సాయంత్రం స్థానిక రైతు వేదికలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడారు. నిరుపేద ఆడపిల్లల వివాహ కష్టాలు తెలుసుకుని సీఎం కేసీఆర్ ఎంతో ముందుచూపుతో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖ, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్, ఆర్‌ఐ అర్జున్, సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

**దళితులందరికీ 'దళితబంధు'**

దళితబంధు విషయంలో దళితులెవ్వరూ అధైర్యపడవద్దని, విడతల వారిగా అందరికీ దళితబంధు వస్తుందని స్థానిక ఎమ్మెల్యే అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దళితబంధు మొదటి విడత 100 మంది లబ్ధిదారులతో ఎమ్మెల్యే సోమవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ మొదటి విడత లబ్ధిదారుల యూనిట్లు ఎలా కొనసాగుతున్నాయి, ఆర్థికంగా ఎలా ఉంది తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.

**పరామర్శ**

డివిజన్ కేంద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు లక్కాకుల జగన్ తండ్రి యాదగిరి ఆదివారం రాత్రి మృతిచెందగా సోమవారం ఎమ్మెల్యే రాజయ్య మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు.

**రిజర్వాయర్లకు నిలయం స్టేషన్‌ఘన్‌పూర్**

**జఫర్‌గఢ్:** రిజర్వాయర్లకు నిలయం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గమని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని ఉప్పుగల్లు రిజర్వాయర్ వద్ద గంగమ్మ తల్లికి ఎమ్మెల్యే సోమవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో అత్యధిక రిజర్వాయర్లను నిర్మించామని తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్, నవాబుపేట, ఉప్పుగల్లు, గండిరామారం, అశ్వరావుపల్లి, చిటకోడూరు, ధర్మసాగర్ రిజర్వాయర్లు నిర్మించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసునూరి మహేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ నాయిని నరేష్, బీఆర్‌ఎస్ నాయకులు పులి ధనుంజయగౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం

**పాలకుర్తి టౌన్:** పాలకుర్తి సోమేశ్వర ఫంక్షన్ హాలులో నూతన ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించిట్లుగా క్లబ్ పూర్వ గవర్నర్ కన్నా పర్శరాములు తెలిపారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా వీరమనేని సోమేశ్వర్ రావు, (కాంట్రాక్టర్) కార్యదర్శిగా జోడు యాకన్న, కోశాధికారిగా గజ్జి సంతోష్ కుమార్ తదితరులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ పాలకుర్తి సేవా భారతి మహిళా క్లబ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించినట్లు చెప్పారు. పోకల చందర్, తమ్మెర లక్ష్మీనర్సింహరావు, వనం గోపాల్, లాయర్ ప్రసాద్‌రావు, ఎర్రబెల్లి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

### లైసెన్స్ తప్పనిసరి



**నర్మెట:** మండలంలోని వాహనచోదకులు లైసెన్స్‌లు తప్పనిసరిగా కలిగిఉండాలని జెడ్పీ కోఆప్షన్ మెంబర్ ఎండి గౌస్ అన్నారు. గత కొద్దిరోజులుగా ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తన సొంత ఖర్చులతో యువతకు లైసెన్స్‌లు అందజేస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలో సోమవారం ఎమ్మెల్యే ఆదేశాలతో లర్నింగ్ లైసెన్స్‌లను అందజేశారు. ఈ సదవాకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గౌస్ కోరారు. గాదర ప్రభికర్, గడ్డం మల్లేష్, కొలెపాక నవీన్, రాజు, భీమయ్య, సంపత్, పవన్ రావి తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**నర్మెట:** అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా తిరుపతి రెడ్డి అన్నారు. ఈసందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ పారునంది శ్రీనివాసుకు సోమవారం అందించి మాట్లాడారు. పెండింగ్ డీఏ విడుదల చేయాలని పీఆర్సీకమిటీతో మధ్యంతర భృతి ప్రకటించాలని, పదోన్నతులు, బదిలీలు వెంటనే చేపట్టాలని, జీఓ 317 బాధితుల సమస్యల పరిష్కారం, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 జీతాలు చెల్లించడంతో పాటు హెల్త్‌కార్డులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ విధానం, మహిళా ఉపాధ్యాయులకు చైల్డ్‌కేర్ లీవ్‌లు, అర్బన్ రెసిడెన్సియల్ ఉపాధ్యాయులకు సమానపనికి సమాన వేతనం వర్తింప చేయాలని అన్నారు. మండల బాధ్యులు బత్తుల నరేందర్, రవికుమార్, రాజ్‌కిరణ్, దామోదర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు**

**బచ్చన్నపేట:** ఉపాధ్యాయుల సమస్యలపై ఎన్ని నిరసనలు, ఉద్యమాలు చేసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి పురోగతి లేదని, సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు భాస్కరుని పృథ్వీరాజ్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ గంగాభవానిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయులు నవీన్, కోటితో పాటు తదితరులు పాల్గొన్నారు.



బచ్చన్నపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

# ఝాన్సీరెడ్డిని కలిసిన జేఏసీ నాయకులు

**దేవరుప్పుల:** కాంగ్రెస్‌పార్టీ పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు హనుమాండ్ల ఝాన్సిరెడ్డిని ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నాయకుడు ఇప్ప పృథ్వీరెడ్డి కలిసినట్లు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడి తగు సూచనలు చేసినట్లు తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజా వ్యతిరేక విధానాలు, అక్రమాలు, ప్రజలను బెదిరించే ధోరణి తదితర అనేక విషయాలను కూలంకషంగా చర్చించినట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తుందని, రాగానే రూ.500కే వంటగ్యాస్ అందిస్తామని, రెండు లక్షల రూపాయల రుణమాఫీని ఏకకాలంలో చేస్తామని చెప్పినట్లు తెలిపారు. తాళ్లపెల్లి వేణు, తూడి రాజు ఉన్నారు.



ఝాన్సీరెడ్డితో మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

## సంక్షిప్త సమాచారం

**పారిశుద్ధ్య పనులు చేసిన సర్పంచ్, ఉపసర్పంచ్**

**కొడకండ్ల:** జీపీ కార్మికులు సమ్మెలో ఉండటంతో సోమవారం మైదంచెరువు తండాలో సర్పంచ్ ధరావత్ మహేష్‌నాయక్, ఉపసర్పంచ్ నరేష్‌నాయక్ కార్మికుల అవతారమెత్తారు. వీధులను శుభ్రం చేసి ట్రాక్టర్‌ను నడిపి చెత్తను తొలగించి, వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాలను శుభ్రం చేశారు. ప్రాథమిక పాఠశాల, తండాల్లోని వీధులను శుభ్రపరిచారు.

**రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే**

**బచ్చన్నపేట:** కేంద్రం, రాష్ట్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని నియోజక వర్గ కిసాన్ కోఆర్డినేటర్ జంగిటి నరేష్ అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కిసాన్ కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న నియోజక వర్గ నాయకులు జాతీయ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుక్పాల్‌సింగ్ ఖైరా తోపాటుగా ఉపాధ్యక్షుడు కోదండరాం రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు సుంకేట అన్వేష్ రెడ్డి, కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్, గట్టయ్యలను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని అన్నారు.

**16వ రోజు కొనసాగిన దీక్షలు**

**జనగామ రూరల్:** పట్టణంలోని దుర్గా కాలనీ వాసులు దారి కోసం చేపడుతున్న దీక్షలు సోమవారం నాటికి 16వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ దేవాదాయ శాఖ అధికారులు 30 ఫీట్ల రోడ్డు మూసివేయడంతో 150 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీవాసులు అవస్థలు పడుతున్నా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. సమస్య పరిష్కరించే వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

**ఆర్థికసాయం**

**కొడకండ్ల:** మండలంలోని మొండ్రాయి గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ యాట అనీల్ ఆకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. కాగా, ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ సభ్యులు తమవంతు సాయంగా సోమవారం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు సింగరం ధర్మేంద్రకుమార్ రూ.5,500 యూనియన్ పక్షాన అందించారు. కార్యదర్శి కృష్ణ, కోశాధికారి ఏకాంబరం, నర్మెట్ట ఉపేందర్, యాకన్న, రామగిరి అనీల్, కమలాకర్, కదారి సోమయ్య, శోభన్, సాయితేజ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**కోడూర్ ఫీల్డ్ అసిస్టెంట్ అదృశ్యం**



యాకస్వామి

**రఘునాథపల్లి:** మండలంలోని కోడూర్ గ్రామానికి చెందిన జాతీయ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ పూజరి యాకస్వామి అదృశ్యమైనట్లు ఎస్సై చాగర్ల రఘుపతి సోమవారం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం బయటకు వెళ్లి వస్తానని యాకస్వామి ఇంట్లో కుటుంబ సభ్యులకు తెలిపి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వాకబు చేసినా జాడ లేదని, ఫోన్ పని చేయడం లేదని యాకస్వామి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**విద్యుదాఘాతంతో గేదె మృతి**



**జనగామ రూరల్:** మండలంలోని పెద్దపహాడ్ గ్రామానికి చెందిన గొల్లపల్లి పర్శరాములుకు చెందిన గేదె సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. రోజు మాదిరిగా పొలం వద్ద గడ్డిమేస్తున్న గేదె విద్యుత్ స్తంభానికి తగిలి కరెంట్‌షాక్‌తో అక్కకక్కడే మృతి చెందింది. గేదె మృతితో రూ.70వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరాడు.

# గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

**జనగామ రూరల్:** పశువులు ఆరోగ్యంగా జీవించడానికి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా రైతులు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి వై.నర్సయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 12 మండలాల్లో కార్యక్రమం కొనసాగుతుందని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**పశువుల సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలి**

**రఘునాథపల్లి:** పశువుల సంరక్షణలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాంజీపేటలో సోమవారం గాలికుంటు, ముద్ద చర్మం వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని స్థానిక సర్పంచ్ గొరిగె భాగ్య, ఎంపీటీసీ రచ్చ సోమనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో గ్రామంలోని 270 పశువులకు టీకాలు వేశామన్నారు. రైతుబంధు మండల సమితి కోఆర్డినేటర్ గొరిగె రవి, పాలకేంద్రం కార్యదర్శి శ్రీనివాస్, భిక్షపతి, పాల్గొన్నారు.

**గాలికుంటు టీకాలు తప్పని సరి**

**నర్మెట:** కాలానుగుణంగా వచ్చేవ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి వేయించాలని మండల పశు వైద్యాధికారిణి సర్పట్‌వార్ నేహ అన్నారు. వెల్దండలో సోమవారం శిబిరాన్ని ప్రారంభించిన వైస్ ఎంపీపీ మంకెన ఆగిరెడ్డి ఆవుకు టీకా వేశారు.

**జీడికల్‌లో ఉచిత పశు వైద్యశిబిరం**

**లింగాలఘణపురం:** జీడికల్‌లో పశువులకు గాలికుంటు, లంపీవైరస్‌ల నివారణకు టీకాలు, దూడల్లో నట్టల నివారణ మందులను ఉచితం అందజేశారు. సర్పంచ్ రాజు ప్రారంభించగా పశువైద్యాధికారిణి అనిత, సిబ్బంది ఎల్‌ఎస్‌ఏ సరస్వతి పాల్గొన్నారు.



జనగామ రూరల్: పశువుకు టీకా వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి నర్సయ్య

**జీవాల ఆరోగ్యానికి టీకాలు తప్పనిసరి**

**జనగామ రూరల్:** జీవాలు ఆరోగ్యంగా ఉండటానికి పాడి రైతులు, పశుపోషకులు టీకా వేయించాలని ఎంపీపీ మేకల కళింగ రాజు అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శామీర్‌పేటలో గాలికుంటు, లంపీస్కిన్ వ్యాధి నిర్మూలనకు టీకా కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. డాక్టర్ శ్రీకాంత్ జేవీఓ హఫీజ్, రాజయ్య, డానియల్ పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి**

**బచ్చన్నపేట:** సీజనల్ వ్యాధులపై పశువుల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి అన్నారు. మండలకేంద్రంతో పాటు బసిరెడ్డిపల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలకు నట్టల నివారణ, గాలికుంటు, లంపీ స్కిన్ వ్యాధి నివారణ మందుల పంపిణీ శిబిరాన్ని మండల పశువైద్యాధికారి రామారావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వడ్డెపల్లి, ఎంపీటీసీ కర్ణాల వేణుగోపాల్, మండల కోఆప్షన్ మెంబర్ షబ్బీర్ పాల్గొన్నారు.



రఘునాథపల్లి: గాలికుంటు నివారణ టీకా వేస్తున్న వైద్యాధికారి అశోక్‌రెడ్డి

**టీకాలు వేయించాలి**

**తరిగొప్పుల:** పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పక వేయించాలని మండల పశువైద్యాధికారి ప్రియాంక్ సూచించారు. అబ్దుల్‌నాగారంలో పశువులకు గాలికుంటు, లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 79 పశువులకు గాలికుంటు,31 పశువులకు లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు. రైతులు పాల్గొన్నారు.

**దేవరుప్పులలో..**

**దేవరుప్పుల:** పశువులకు సీజనల్‌గా వచ్చే గాలికుంటు వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని టీకాలను వేయించాలని పశువైద్యాధికారి సింధుప్రియ సూచించారు. మండలకేంద్రంతోపాటు మండలంలోని నీర్మాల, చిన్నమడూరు గ్రామాల్లో గాలికుంటు టీకాలు, నట్టల నివారణ, లంపిస్కన్‌వ్యాధి నివారణ టీకాలను కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సర్పంచ్ రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, జేవీఓ శ్రీనివాస్, ఎల్‌ఎస్‌ఏ శ్రీనివాస్, సర్వర్, సురేందర్, పాషా, గోపాలమిత్ర శోభన్, రైతులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా డైనింగ్ హాల్

- గొర్రెల పాకగా ఎంఆర్సీ
- పనులు పూర్తిచేయాలని వేడుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**తరిగొప్పుల:** ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని చేపట్టింది. కోట్ల నిధులు వెచ్చించి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అధికారుల అలసత్వం, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా మండల పరిధిలో మన ఊరు–మనబడిలో భాగంగా చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మండలకేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో చేపట్టిన డైనింగ్ హాలుతో పాటు మండల విద్యా వనరుల కేంద్రం భవనం నిర్మాణం పనులు అసంపూర్తిగా మిగిలాయి. నిధుల లేమి కారణంగా డైనింగ్ హాలు, కాంట్రాక్టరు చేతులెత్తయడంతో విద్యా వనరుల భవనం నిర్మాణం పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఎంఆర్సీ భవనం ఏకంగా గొర్రెల పాకగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకొని అసంపూర్తింగా ఉన్న నిర్మాణం పనులు పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న డైనింగ్ హాల్ భవనం



గొర్రెల వ్యర్థాలతో నిండిన ఎంఆర్సీ భవనం